రంగడికి సేవ చేయడం మహద్భాగ్యం


ధర్మకర్తల మండలి సభ్యులతో అనిల్‌కుమార్

• ఎమ్మెల్యే అనిల్‌కుమార్

నెల్లూరు(బృందావనం): చారిత్రక ప్రాశస్త్యం కలిగిన శ్రీదేవీ, భూదేవీ సమేత తల్పగిరి రంగనాథస్వామికి సేవ చేయడం మహద్భాగ్యమని నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ పేర్కొన్నారు. దేవస్థాన నూతన ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారాన్ని రంగనాయకులపేటలోని రంగనాథస్వామి కల్యాణ మండపంలో ఆదివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే హాజరయ్యారు. ధర్మకర్తల మండలి చైర్మన్‌గా మంచికంటి శ్రీనివాసులు, సభ్యులుగా పిన్నపరెడ్డి రాజేంద్ర, వేలూరు శ్రీనివాసులు, సాదా గోపీ, బల్లవోలు రమణయ్య, ఎరబోలు మాధవి, అడపా లక్ష్మి, భాగి ప్రియాంక, వీరేపల్లి పద్మజ, ఎక్స్ అఫీషియో సభ్యుడిగా దొరస్వామి ప్రమాణ స్వీకారం చేశారు. ఈఓ డబ్బుగుంట వెంకటేశ్వర్లు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి సన్నపురెడ్డి పెంచలరెడ్డి, కార్పొరేటర్లు అస్మ, గుంజి జయలక్ష్మి, ఏపీ ఆగ్రో డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కొణిదెల సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు చేరుకున్న అయోధ్య సైకిల్‌యాత్ర



నెల్లూరు(దర్గామిట్ట): అయోధ్యకు ఆదివాసీ చిన్నారులు చేపట్టిన సైకిల్ యాత్ర నెల్లూరుకు ఆదివారం చేరుకుంది. రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని నగరంలోని ఆయన నివాసంలో సైకిల్ యాత్ర చేపట్టిన వారు కలుసుకున్నారు. యాత్ర విశేషాలను నిర్వాహకుడు వంశీధర్‌ను అడిగి తెలుసుకున్నారు. వారికి ఆర్థిక సాయాన్ని ఎంపీ అందజేశారు. అనంతరం సైకిల్ యాత్ర జెండా ఊపి ప్రారంభించారు.

ఘనంగా ‘లింబో’ చిత్ర ఆడియో ఆవిష్కరణ



నెల్లూరు(బృందావనం): నగరంలోని పురమందిరంలో లింబో చిత్ర ఆడియో ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా క్లాసికల్, వెస్టన్ డ్యాన్స్, సింగింగ్ ఫెస్ట్‌ను జరిపారు. మదీనా వాచ్ కంపెనీ అధినేత ఇంతియాజ్‌కు సేవారత్న.. వైద్యుడు పెంచలరెడ్డికి వైద్యరత్న అవార్డులను అందజేశారు. పినాకినీ యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మురళీమోహన్‌రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో 25 కళాసంఘాల అధ్యక్షుడు అమరావతి కృష్ణారెడ్డి, సినీ దర్శకుడు మహేష్‌చంద్ర, నటులు ఓంకార్‌వర్మ, రూపరెడ్డి, వివిధ రంగాలకు చెందిన కొండూరు హరినారాయణరెడ్డి, షబ్బీర్, అందె శ్రీనివాసులు, దర్శకులు సుధాకర్‌రెడ్డి, మురళీమోహన్‌రాజు, నిర్మాత శైలజ తదితరులు పాల్గొన్నారు.

అయోధ్య బాలరాముడికి ప్రణమిల్లి..

అయోధ్యలోని రామ మందిరంలో బాలరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠను సోమవారం పురస్కరించుకొని నెల్లూరుకు చెందిన కళాకారులు ప్రణమిల్లారు. – నెల్లూరు(బృందావనం)


హరనాథపురానికి చెందిన సూక్ష్మ కళాకారుడు, ఉపాధ్యాయుడు సోమా పద్మారత్నం అట్ట ముక్కలతో ఐదు సెంటీమీటర్ల పరిమాణంలో అయోధ్య రామ మందిరాన్ని నయనానందకరంగా తీర్చిదిద్దారు.


మూలాపేటలోని బ్రాహ్మణవీధికి చెందిన సూక్ష్మ కళాకారుడు, ఉపాధ్యాయుడు గంధవళ్ల ఉమాశంకర్ రావి ఆకుపై సీతా, రామ, లక్ష్మణ, హనుమంతుడు.. అయోధ్య రామ మందిర నమూనాను తీర్చిదిద్దారు.

దళితుల సంక్షేమం జగన్‌తోనే సాధ్యం

నెల్లూరు రూరల్: రాష్ట్రంలో దళితుల సంక్షేమం సీఎం జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత, రైల్వే బోర్డు సభ్యుడు స్వర్ణా వెంకయ్య పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం ఆయన మాట్లాడారు. దేశ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా విజయవాడలో అంబేడ్కర్ భారీ విగ్రహాన్ని నెలకొల్పడం ద్వారా దళితులకు సముచిత స్థానాన్ని కల్పించారని చెప్పారు. రానున్న ఎన్నికల్లో నెల్లూరు రూరల్ నియోజకవర్గం నుంచి పార్టీ తరఫున పోటీ చేయనున్న ఆదాల ప్రభాకర్‌రెడ్డి ఘన విజయం సాధించడం ఖాయమని తెలిపారు.

వైఎస్సార్‌సీపీలో సముచిత స్థానం


పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే అనిల్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికీ సముచిత స్థానాన్ని కల్పిస్తామని నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ పేర్కొన్నారు. 49, 50వ డివిజన్లకు చెందిన తెలుగు యువత నగర ప్రధాన కార్యదర్శి అల్లాబక్షు, టీడీపీ నగర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి గునుపాటి కిషోర్ వారి మిత్ర బృందంతో కలిసి ఎమ్మెల్యే సమక్షంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో ఆదివారం చేరారు. ఇస్కాన్ సిటీలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో వీరికి పార్టీ కండువాలను కప్పి సాదరంగా ఆహ్వానించిన అనంతరం అనిల్ మాట్లాడారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమం, అభివృద్ధిని చూసి ఆకర్షితులై తమ పార్టీలో చేరిన వారికి కృతజ్ఞతలను తెలియజేశారు. కై ఫ్, అబ్దుల్ సలీమ్, హమీద్, కిరణ్, ప్రభుదాస్, కావలి గోవిందరావు, జాన్ వెస్లీ తదితరులు పార్టీలో చేరారు. నేతలు వందవాసి రంగ, తాళ్లూరు రాము, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో చిత్రరంగ అభివృద్ధికి కృషి


ఏఎం రత్నంకు సత్కారం

నెల్లూరు(బృందావనం): రాష్ట్రంలో చిత్రరంగ అభివృద్ధికి కృషి చేస్తామని ఆంధ్రప్రదేశ్ ఫిల్మ్ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు, ప్రముఖ నిర్మాత ఏఎం రత్నం పేర్కొన్నారు. పురమందిర ప్రాంగణంలోని ఏసీ హాల్లో ఏఎం రత్నాన్ని కళాంజలి అనంత్ ఆధ్వర్యంలో ఆదివారం సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో చిత్ర రంగాన్ని అభివృద్ధి చేసేందుకు గానూ ఆంధ్రప్రదేశ్ ఫిల్మ్ చాంబర్ ఆఫ్ కామర్స్‌ను ఏర్పాటు చేశామని వివరించారు. దీని బలోపేతానికి గానూ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో చిత్రరంగ పరిశ్రమతో సంబంధం ఉన్న ప్రతి ఒక్కర్నీ భాగస్వామ్యం చేస్తున్నామని వివరించారు. కవులు, కళాకారులు, రచయితలు, నటీనటులకు నెల్లూరు పుట్టినిల్లన్నారు. వీరిని స్ఫూర్తిగా తీసుకొని నేటితరం కళాకారులు ఉన్నతంగా ఎదగాలని కాంక్షించారు. ఆంధ్రప్రదేశ్ ఫిల్మ్ చాంబర్ ఆఫ్ కామర్స్ జిల్లా కన్వీనర్‌గా కళాంజలి అనంత్‌ను నియమిస్తున్నామని ప్రకటించారు.

ధనలక్ష్మీపురంలో రక్తదాన శిబిరం



నెల్లూరు రూరల్: ధనలక్ష్మీపురంలోని జెడ్పీ హైస్కూల్లో రక్తదాన శిబిరాన్ని హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. రక్తాన్ని రెడ్‌క్రాస్, నోవా బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో సేకరించారు. సొసైటీ అధ్యక్షుడు కుంచాల విజయభాస్కర్‌ను సత్కరించారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన



నెల్లూరు(బారకాసు): వికసిత్ భారత్ సంకల్ప యాత్రను నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ పథకాల అమలుపై వేదాయపాళెంలోని రిలయన్స్ ట్రెండ్స్ సమీపంలో, లెక్చరర్స్ కాలనీలో ప్రచార వాహనం, శిబిరాల ద్వారా అవగాహన కల్పించారు. డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, నగరపాలక సంస్థ సెక్రటరీ హేమావతి తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్పస్వామికి విశేష పూజలు



నెల్లూరు(బృందావనం): నగరంలోని అయ్యప్పస్వామి దేవస్థానంలో వార్షిక ప్రతిష్ఠా దినోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో ఆదివారం నిర్వహించారు. కేరళ సంప్రదాయం ప్రకారం మకర మాస రోహిణి నక్షత్రాన్ని పురస్కరించుకొని అయ్యప్పస్వామికి మహాగణపతి హోమం, విశేష నవ కలశ పూర్ణాభిషేకం, పుష్పాభిషేకం, అర్చన, మహాహారతిని జరిపారు. అయ్యప్ప సేవా సమాజ అధ్యక్ష, కార్యదర్శులు శేషగిరిరావు, వెంకటరత్నం, కోశాధికారి రత్నయ్య, మురళీమోహన్‌రెడ్డి, నాగేశ్వరరావు, అక్కెం మల్లికార్జునరెడ్డి, చంద్రప్రభ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడిపై చర్యలకు వినతి

నెల్లూరు(టౌన్): వెంకటాచలం మండలం నాయడుపాళెంలో ప్రభుత్వ ఉపాధ్యాయుడు చేవూరి సుబ్బారావు వృత్తిని వదిలేసి విధులకు హాజరుకాకుండా కులసంఘాన్ని భుజాలపై పెట్టుకొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రకటనలిస్తున్నారని ఆంధ్రప్రదేశ్ గిరిజన సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు పాలకీర్తి రవి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేరకు ఆయనపై చర్యలు చేపట్టాలని కోరారు.

నిరుపేద బ్రాహ్మణుల సంక్షేమమే ధ్యేయం


మాట్లాడుతున్న రామచంద్రరావు

నెల్లూరు(బృందావనం): నిరుపేద బ్రాహ్మణుల సంక్షేమమే లక్ష్యంగా యునైటెడ్ బ్రాహ్మణ ఫోరం(యూబీఎఫ్)ను ఏర్పాటు చేశామని సంస్థ నిర్వాహకుడు రామచంద్రరావు పేర్కొన్నారు. బాలాజీనగర్‌లోని కురువాడ లలితమ్మ ఫంక్షన్ హాల్లో ఆదివారం నిర్వహించిన యూబీఎఫ్ సమావేశంలో ఆయన మాట్లాడారు. నగరంలోని నిరుపేద, మధ్యతరగతి బ్రాహ్మణులు అపరకర్మల నిర్వహణలో ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని, వీరి కోసం రూ.25 లక్షల విలువైన స్థలాన్ని హైదరాబాద్‌కు చెందిన వరుముల ఉమామహేశ్వరరావు విరాళంగా అందజేశారని చెప్పారు. ఆ స్థలంలో అపరకర్మల నిర్వహణకు భవన నిర్మాణాన్ని చేపట్టనున్నామని వెల్లడించారు. ప్రవీణ్, పవని నాగేంద్రప్రసాద్, శ్రీశైలం శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

కులగణనకు సహకరించాలి

కొడవలూరు: ప్రతిఒక్కరూ కులగణనకు సహకరించాలని ఈఓపీఆర్డీ వి.డేవిడ్ కోరారు. కొడవలూరులో జరుగుతున్న కులగణనను ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కులాల వారీగా జన సంఖ్యను తెలుసుకోవడం ద్వారా ఆ మేరకు ప్రభుత్వ పథకాలందించే వెసులుబాటు ఉంటుందన్నారు. ఎంతో ఉపయోగకరమైన కులగణనకు ప్రతిఒక్కరూ సహకారం అందించాలని కోరారు. పంచాయతీ కార్యదర్శి జి.రాధాకృష్ణ, వెల్ఫేర్ అసిస్టెంట్ బాలకృష్ణ, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ఉన్నారు.

విద్యుత్ రంగంలో విప్లవాత్మక మార్పులు


రైతుకు చెక్కును అందజేస్తున్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి

• మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

నెల్లూరు(దర్గామిట్ట): విద్యుత్ రంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. విద్యుత్ లైన్లు పంట పొలాల మీదుగా వెళ్లడంతో నష్టపోయిన రైతులకు పరిహార చెక్కులను నగరంలోని తన నివాసంలో ఆదివారం అందజేసిన అనంతరం మంత్రి మాట్లాడారు. కృష్ణపట్నం – మనుబోలు 400 కేవీ విద్యుత్ లైన్ ఇంటర్‌లింకింగ్‌తో టవర్ భూమి, పంట నష్టపోయిన నేలటూరు, పైనాపురం గ్రామాల్లోని 10 మంది రైతులకు విద్యుత్ శాఖ ద్వారా మంజూరైన రూ.10.38 లక్షల చెక్కులను అందజేశామని తెలిపారు. విద్యుత్ లైన్ల మార్పు, ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు ద్వారా రైతులు, గృహావసరాలకు నాణ్యమైన విద్యుత్‌ను తమ ప్రభుత్వంలో అందిస్తున్నామని చెప్పారు. లోఓల్టేజీ సమస్యలను అధిగమించేందుకు అవసరమైన చోట నూతన సబ్‌స్టేషన్లను ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు.

దీర్ఘకాలంగా విద్యుత్ లైన్లు మార్చాల్సిన ప్రాంతాల్లో రైతులకు నష్టపరిహారాన్ని చెల్లించి నూతన లైన్లను ఏర్పాటు చేసి సబ్‌స్టేషన్లకు అనుసంధానిస్తున్నామన్నారు. రైతులు, ప్రజల ప్రయోజనాలే లక్ష్యంగా విద్యుత్ వ్యవస్థలో అనేక సంస్కరణలను తీసుకొచ్చామని తెలిపారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్‌జేడబ్ల్యూ పాలిస్టిన్, డీఈ సుధీర్‌బాబు, నేతలు పరిడి రామ్మోహన్‌రెడ్డి, ఈపూరు కోటారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ సమావేశం


డాక్టర్ సతీష్‌ను సత్కరిస్తున్న నిర్వాహకులు

నెల్లూరు(బృందావనం): ఆచారివీధిలోని నెల్లూరు క్లాత్ మర్చంట్స్ అసోసియేషన్ హాల్లో ఆర్యవైశ్య సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ సతీష్ వివిధ ఆరోగ్య అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం జనవరిలో జన్మించిన సీనియర్ సిటిజన్లను సత్కరించారు. అయోధ్యలో రాముడి విగ్రహాన్ని ప్రతిష్ఠించనున్న నేపథ్యంలో రామ కీర్తనలు, భజనలను ఆలపించారు. అన్నదానం చేశారు. అనంతరం సతీష్‌ను సన్మానించారు. అసోసియేషన్ అధ్యక్షుడు గుండ్లపల్లి శ్రీధర్‌రావు, ప్రధాన కార్యదర్శి చుండూరు కృష్ణమూర్తి, కోశాధికారి అద్దేపల్లి సుబ్బారావు, సభ్యులు పచ్చిపులుసు శ్రీరాములు, కృష్ణయ్య, బ్రహ్మానందం తదితరులు పాల్గొన్నారు.

10న మాదిగల యుద్ధభేరి మహాసభ


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నేతలు

నెల్లూరు(వేదాయపాళెం): మాదిగల యుద్ధభేరి మహాసభను నగరంలోని నర్తకి సెంటర్‌లో ఫిబ్రవరి పదిన నిర్వహించనున్నామని సీమాంధ్ర ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పందిటి సుబ్బయ్య పేర్కొన్నారు. కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను నగరంలోని అంబేడ్కర్ భవన్‌లో ఆదివారం ఆవిష్కరించిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. మాదిగల హక్కులు.. రాజకీయ ప్రాధాన్యం కోసం సభను నిర్వహించనున్నామని చెప్పారు. కార్యక్రమానికి భారీగా తరలిరావాలని కోరారు. ఆలిండియా ఎస్సీ, ఎస్టీ యునైటెడ్ ఫోరమ్ అధ్యక్షుడు కుడుముల సుబ్బారావు, ఎమ్మార్పీఎస్ నేతలు గడ్డం శేఖర్, బద్దెపూడి వెంకట్రావు, రత్నయ్య, చిన్నయ్య, మల్లికార్జున, సాల్మన్ తదితరులు పాల్గొన్నారు.

మధ్వ సంఘ సమావేశం


సమావేశానికి హాజరైన నిర్వాహకులు

నెల్లూరు(బృందావనం): మండపాలవీధిలోని గురురాఘవేంద్రస్వామి మఠంలో సింహపురి మధ్వ సంఘ సమావేశాన్ని సంఘ అధ్యక్షుడు దేవర్స సుబ్బారావు అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. మధ్వ నవమి సందర్భంగా రాఘవేంద్రస్వామి సన్నిధిలో నిర్వహించనున్న కార్యక్రమాలపై చర్చించారు. కంబాలూరు నరసింహశ్రీధరాచార్యులు, అరవపల్లి సుబ్బారావు, కరూర్ రంగాచార్యులు, దేవర్స నాగరాజారావు, తడకపల్లి రవీంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

కులగణన నుంచి మినహాయింపునివ్వాలని వినతి

నెల్లూరు(పొగతోట): గ్రామ, వార్డు సచివాలయాల్లో విధులు నిర్వర్తిస్తున్న గ్రేడ్ – 3 ఏఎన్‌ఎంలకు కులగణన నుంచి మినహాయింపునివ్వాలని ఐఎన్‌టీయూసీ రాష్ట్ర నేతలు సుధాకర్‌రెడ్డి, నాగరాజు, శశిధర్, ఏపీజీఈఏ నేత మల్లికార్జున కోరారు. ఈ మేరకు నగరంలోని ఏపీజీఈఏ కార్యాలయంలో సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు.

క్లుప్తంగా

వ్యక్తి మృతి

నెల్లూరు(క్రైమ్): అనారోగ్యంతో ఓ వ్యక్తి తన ఇంట్లో మృతి చెందారు. మృతదేహం కుళ్లి తీవ్ర దుర్గంధం వెదజల్లుతుండటంతో మృతుడి బంధువులు, పోలీసులకు స్థానికులు సమాచారం అందించారు. పోలీసుల సమాచారం మేరకు.. మూలాపేటలోని బెస్తవారిపాళేనికి చెందిన సురేష్‌రెడ్డి (55) అవివాహితుడు. ఎలక్ట్రీషియన్ పనులు, జ్యోతిష్యం చెప్తూ ఒంటరిగా ఉంటున్నారు. ఇంటి నుంచి తీవ్ర దుర్గంధం వెదజల్లుతుండటంతో స్థానికులు మూలాపేటలో నివాసం ఉంటున్న అతని సోదరుడి కుమారుడు అయ్యప్పరెడ్డి, చిన్నబజార్ పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకొని ఇంటి తలుపులను పగలగొట్టి లోపలికి వెళ్లి చూడగా, సురేష్‌రెడ్డి మృతి చెంది ఉన్నారు. సురేష్‌రెడ్డి మృతి చెంది మూడు, నాలుగు రోజులై ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించారు. అయ్యప్పరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని చిన్నబజార్ ఎస్సై సైదులు తెలిపారు. అనారోగ్యమే మృతికి కారణమని తెలిపారు.

ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన


రోగులకు వైద్యసేవలు అందిస్తున్న వైద్యులు

తోటపల్లిగూడూరు : తోటపల్లిగూడూరు జెడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో నెల్లూరుకు చెందిన సుధీర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ శిబిరంలో న్యూరో, గర్భకోశ వ్యాధులకు సంబంధించిన వైద్య సేవలను ఉచితంగా అందించారు. బీపీ, షుగర్, ఈసీజీ, కేన్సర్ స్క్రీనింగ్ సేవలను కూడా అందించడంతో పాటు ఉచితంగా మందులను అందజేశారు. తోటపల్లిగూడూరు, ఇస్కపాళెం, తోటపల్లి, కామాక్షినగర్, డక్కులవారిపాళెం గ్రామాలకు చెందిన దాదాపు 200 మంది రోగులు ఉచిత వైద్య సేవలను పొందారు. ఈ కార్యక్రమంలో వైద్యులు ధీరజ్, నాగమాణిక్యం తదితరులు పాల్గొని రోగులకు వైద్య సేవలను అందించారు.

కామాక్షితాయి సేవలో..


విక్రమ్‌సింహాకు తీర్థప్రసాదాలను అందజేస్తున్న ఆలయ సిబ్బంది

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: మండలంలోని జొన్నవాడలో కొలువైన మల్లికార్జున సమేత కామాక్షితాయి అమ్మవారిని జిల్లా ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ మేజిస్ట్రేట్ జి.విక్రమ్‌సింహా ఆదివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ సిబ్బంది అతిథిని సత్కరించి తీర్థ ప్రసాదాలు అందించారు.

రూరల్ ఆర్యవైశ్య సంఘ జిల్లా అధ్యక్షుడిగా చెంచయ్య

పొదలకూరు : జిల్లా రూరల్ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా పొదలకూరు పట్టణానికి చెందిన ఆమర్తలూరు చెంచయ్యను ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా ముత్తుకూరు మండలానికి చెందిన చెందా వెంకటస్వామి, కోశాధికారిగా బుచ్చిరెడ్డిపాళెం మండలానికి చెందిన టి.ఆదినారాయణ, అదనపు కార్యదర్శిగా పొదలకూరు పట్టణానికి చెందిన పొట్టి సుధాకర్‌ను నియమించినట్లు వారు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

శాస్త్రోక్తంగా ఏకాదశి పూజలు


విశేషాలంకారంలో స్వామి, అమ్మవార్లు

మనుబోలు : స్థానిక శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవాలయం(విష్ణాలయం)లో ఆదివారం ఏకాదశి పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అర్చకుడు హనుమాచార్యులు సూర్యోదయానికి ముందే స్వామివారికి అభిషేకాలు జరిపించి ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. అనంతరం సుప్రభాత సేవ, తిరుప్పావై చేసి వేద మంత్రోచ్చారణల మధ్య భక్తుల గోత్రనామాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామి అమ్మవార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం ఆలయం వద్ద 300 మందికి అన్నప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమాలకు బొమ్మిరెడ్డి శంకర్‌రెడ్డి, అనసూయమ్మ, బొమ్మిరెడ్డి మధుసూదన్‌రెడ్డి, జానకి దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. ప్రత్యేక పూజల అనంతరం ఉభయకర్తలకు అర్చకుడు వేద ఆశీర్వాచనాలు అందజేశారు.